క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


ఆందోళన నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

భీమునిపట్నం: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ భీమిలి శాఖ ఆధ్వర్యంలో సోమవారం తాహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. జిల్లా ఫెడరేషన్ అధ్యక్షుడు సీహెచ్.కరుణాకరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని, మధ్యంతర భృతి, డీఏలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో ఖాళీలు భర్తీ చేయాలని, సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, అన్ని పాఠశాలల్లో మాతృభాష కొనసాగించాలని కోరారు. అర్బన్ శాఖ అధ్యక్షుడు రొంగలి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చిప్పాడ మోహన కృష్ణ, మండల శాఖ అధ్యక్షుడు కె.సన్యాసినాయుడు, ఇతర నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు.

ఘనంగా సాయి ధ్యాన మందిరం వార్షికోత్సవం


ధ్యాన మందిరంలో పేదలకు వస్త్రదానం చేస్తున్న చైర్మన్ శ్రీనివాసరావు

పద్మనాభం: మండలంలోని శేరిఖండంలో షిర్డీ సాయి ధ్యాన మందిరం 15వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కాకడి హారతి, పంచామృత, రస, విభూది అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పేదలకు వస్త్రదానం, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సంగు శ్రీనివాసరావు , సర్పంచ్ పల్లంటి చిన్నారావు, మట్టా సతీష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో దళితులకు అన్యాయం

తగరపువలస: మామిడిలోవ పంచాయతీలో ఉపాధి హామీ పనుల్లో దళితులకు అన్యాయం జరుగుతోందని డెంకాడ అర్జునరావు కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం రిజర్వ్ అయినా, తనను పనిలోకి తీసుకోకుండా అవమానించారని, కుల వివక్ష చూపి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇద్దరు ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

భీమిలిలో ఫుట్‌బాల్ శిక్షణ ప్రారంభం


జెర్సీలతో చిన్నారులు

భీమునిపట్నం: భీమిలిలోని వుడా క్రీడామైదానంలో సోమవారం బాలురకు ఉచిత వేసవి ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం ప్రారంభమైంది. స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమం జూన్ 5వ తేదీ వరకు ఉదయం, సాయంత్రం కొనసాగుతుంది. ఎంపిక చేసిన 35 మంది బాలురు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. వారికి అవసరమైన జెర్సీలు, ఫుట్‌బాల్స్‌ను స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ అందజేశారు. కార్యక్రమంలో ఆహ్వానితులు కలిగొట్ల శ్రీరామ్, అక్కరమాని చినబాబు, గొలగాని నరేంద్రకుమార్ , రేలంగి చినబాబు పాల్గొన్నారు.

వృద్ధ దంపతులకు నివాళి


వృద్ధ దంపతుల చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మజ్జి శ్రీనివాసరావు

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీ రామన్నపేటలో ఇటీవల మృతి చెందిన వృద్ధ దంపతులు సుంకర సత్యనారాయణ, రామయ్యమ్మల పెద్ద కర్మ సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) హాజరై నివాళులర్పించారు. జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. సత్యనారాయణ మృతి చెందిన 15 నిమిషాల్లోనే ఆయన భార్య రామయ్యమ్మ కూడా మరణించడం స్థానికంగా విషాదాన్ని నింపింది.

ఇక్కడ కొంటే ఆరోగ్యం ఫినిష్

స్థానిక ప్రైవేట్ మార్కెట్ శివారులో టాయిలెట్లు..వాటి నుంచి నిరంతరం కలుషిత నీరు బయటకు ప్రవహిస్తూ, ఆ ప్రాంతాన్ని మరింత గలీజుగా మారుస్తోంది. దుర్గంధభరితమైన ఆ ప్రదేశంలోనే పంది మాంసం విక్రయం జరుగుతుండగా, దాని పక్కనే నాచు పేరుకుపోయిన నేలపై పచ్చి చేపలు అమ్ముతున్నారు. మరోవైపు ఎండిన చేపల దుకాణాలు దర్శనమిస్తున్నాయి. ఈ అపరిశుభ్రమైన వాతావరణంలో క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. నిశితంగా పరిశీలిస్తే అంగుళం సైజులో పురుగులు సైతం కనిపిస్తున్నాయి. ఇక్కడ కొనుగోలు చేసిన చేపలను ఇంటికి తీసుకువెళ్లి వండుకుని తింటే వారి ఆరోగ్యం క్షీణించడం ఖాయం. ఇలాంటి కలుషితమైన చేపలు తిన్న మరుసటి రోజు వాంతులు, విరేచనాలతో బాధపడేవారు ఎందరో ఉన్నారు. -తగరపువలస

- చేపల మార్కెట్‌లో టాయిలెట్ల మురుగు
- ఆ ప్రాంతమంతా కలుషితం
- అనారోగ్యం బారిన పడుతున్న వినియోగదారులు
- పరిశుభ్రత పాటించని వ్యాపారులు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు


ప్రయివేట్ మార్కెట్‌లో విక్రయిస్తున్న చేపలు

చెరువులు, నదుల్లో కాలుష్యం పెరగడం వల్లే ఇలా జరుగుతోందని కొందరు భావిస్తున్నప్పటికీ, నిజానికి మార్కెట్‌లోని అపరిశుభ్రమైన పరిస్థితులు కూడా దీనికి ప్రధాన కారణం. చేపల రుచికి అలవాటు పడిన కొనుగోలుదారులు మార్కెట్‌లోని ఈ దుర్భరమైన వాతావరణాన్ని పట్టించుకోవడం లేదు.

పట్టించుకోని శానిటరీ అధికారులు

భీమిలి జోన్‌లోని వార్డు సచివాలయాల్లో శానిటరీ సూపర్‌వైజర్లు ఉన్నప్పటికీ, వారి పనితీరు ప్రశ్నార్థకంగా మారుతోంది. అమావాస్య, పౌర్ణమి సమయాల్లో పాలిథిన్ సంచుల తనిఖీలకే పరిమితమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక ప్రైవేట్ మార్కెట్‌లోని అపరిశుభ్రమైన పరిస్థితులను వారు పట్టించుకోవడం లేదు. ఆ మార్కెట్‌లోని గలీజు ప్రాంతంలో చేపల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. చేపలు, కోళ్ల వ్యర్థాలు అక్కడే పడేసినా శానిటరీ సిబ్బంది చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాదు, చెరువు చేపలు విక్రయించేవారు ఇక్కడ గుత్తాధిపత్యం చెలాయిస్తూ, తమ ఇష్టానుసారం ధరలు నిర్ణయిస్తున్నారని, తుప్పు పట్టిన తూకం రాళ్లు వినియోగిస్తున్నారని కొనుగోలుదారులు వాపోతున్నారు.


తుప్పు పట్టిన తూకం గుండ్లతోనే చేపల విక్రయాలు

మార్కెట్‌లో శుభ్రత లేదు..



ప్రయివేట్ మార్కెట్‌లో శుభ్రత లేకపోయినా జీవీఎంసీ శానిటేషన్ విభాగం పట్టించుకోదు. ముఖ్యంగా చేపల మార్కెట్ పరిసరాలు అధ్వానంగా ఉంటున్నాయి. ఇక్కడ నుంచి చేపలు కొనుగోలు చేయాలన్నా భయంగా ఉంటుంది. ప్రజల ఆరోగ్యంపై జీవీఎంసీ దృష్టి సారించాలి.
–కుంచం రమణ, కొత్తపేట

ప్రత్యేకంగా చేపల మార్కెట్ ఉండాలి



చేపల విక్రయానికి ప్రత్యేకంగా ఒక మార్కెట్ ఉండాలి. అందులోనూ పరిశుభ్రతకు, కొనుగోలుదారుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చే విధంగా ఉండాలి. ఆ ఉద్దేశ్యంతోనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్లు తెరచినా దురదృష్టవశాత్తూ మన ప్రాంతంలో ఎవరూ ముందుకు రాలేదు.
–చిల్ల గణేష్‌రెడ్డి, చిల్లపేట

కనీస సౌకర్యాలు శూన్యం

చేపలు విక్రయించే వారి నుంచి డబ్బులు వసూలు చేయడంలో యాజమాన్యం చూపే శ్రద్ధ, వారికి కనీస సౌకర్యాలైన షెల్టర్లు, ప్లాట్‌ఫారాలు, చేపలు శుభ్రం చేయడానికి నీటి సౌకర్యం కల్పించడంలో చూపకపోవడం విచారకరం. కనీసం ప్రతి రోజూ ఈ చేపల విక్రయ ప్రాంతాన్ని శుభ్రం చేయరు సరికదా, మార్కెట్ చరిత్రలో ఫినాయిల్ చల్లించిన సందర్భాలు కూడా లేవంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.


అపరిశుభ్రమైన వాతావరణంలో చేపల విక్రయాలు, నిల్వలు

ఈ ప్రాంతాన్ని శుభ్రం చేయరా?


పంది మాంసాన్ని అసహ్యించుకునే కొందరు, దాని పక్కనే అమ్ముతున్న చేపలను మాత్రం ఇష్టంగా కొనుక్కుని వెళ్లడం గమనార్హం. మార్కెట్ యాజమాన్యం వెంటనే స్పందించి, ఈ ప్రాంతాన్ని శుభ్రం చేయడంతో పాటు, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కొనుగోలుదారులు కోరుతున్నారు. లేకపోతే ప్రజారోగ్యం మరింత ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

ఆదివారం 5 టన్నుల వరకు చేపల విక్రయాలు

సాధారణ రోజుల్లో ఈ ప్రైవేట్ మార్కెట్‌లో సుమారు 500 కిలోల చేపలు విక్రయం కాగా, మంగళవారం 3 టన్నులు, ఆదివారం 5 టన్నుల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. ఇటీవల బర్డ్‌ఫ్లూ కారణంగా చికెన్‌కు డిమాండ్ తగ్గడంతో చేపలకు మరింత గిరాకీ పెరిగింది. ఈ నేపథ్యంలో శానిటరీ సూపర్‌వైజర్లు తమ బాధ్యతను గుర్తించి, మార్కెట్‌లోని అపరిశుభ్రమైన పరిస్థితులను చక్కదిద్దాలని వినియోగదారులు కోరుతున్నారు. అలాగే సంబంధిత అధికారులు స్పందించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆరోగ్యానికి తీవ్ర ముప్పు

మార్కెట్‌లో చేపలు శుభ్రం చేసేవారు కనీస జాగ్రత్తలు కూడా పాటించడం లేదు. నేలపై ఫ్లెక్సీలు వేసి, వాటిని శుభ్రం చేయకుండానే ప్రతిరోజూ ఉపయోగిస్తున్నారు. ఇలాంటి అపరిశుభ్రమైన వాతావరణం వినియోగదారుల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు కలిగిస్తోంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం వినియోగదారులకు రక్షణ కల్పించేందుకు సంగివలస, బంగ్లామెట్టలో ప్రత్యేక చేపల మార్కెట్ల నిర్మాణానికి ప్రయత్నించినా అది కార్యరూపం దాల్చలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర మార్కెట్లను ఏర్పాటు చేయాలని ప్రయత్నించినా, స్థానిక మత్స్యకారులు ముందుకు రాలేదు.




అపరిశుభ్ర వాతావరణంలోనే చేపలు శుభ్రం చేయించుకుంటున్న వినియోగదారులు

చేపల వినియోగం ఎక్కువ..



మన ప్రాంతంలో చికెన్ కంటే చేపల వినియోగం ఎక్కువ. చెరువు చేపల లభ్యత కూడా ఇక్కడే బాగుంటుంది. ఇక్కడ నుంచే గ్రామీణ ప్రాంతాలకు చేపలు తీసుకువెళ్లి విక్రయిస్తుంటారు. అందువలన స్టోరేజీ, మార్కెటింగ్ సదుపాయాలతో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చేలా చేపల మార్కెట్ ఉండాలి. –మేకల శ్రీను, చిట్టివలస

జీవీఎంసీ అధికారులు అంతే..

- పోటాపోటీగా చలివేంద్రాల ఏర్పాటు
- అధికారుల అనాలోచిత నిర్ణయంపై విమర్శలు

మధురవాడ: జీవీఎంసీ అధికారుల తీరు మరోసారి విమర్శలకు దారితీసింది. ఎండలు మండిపోతున్న వేళ ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాల విషయంలోనూ వారి అనాలోచిత నిర్ణయాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అవసరమైన ప్రాంతాలను గుర్తించకుండా, తమకు తోచిన చోట చలివేంద్రాలు ఏర్పాటు చేస్తుండటంతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. తాజాగా 6వ వార్డు పరిధిలోని కొమ్మాది త్రిశక్తి ఆలయం వద్ద చోటుచేసుకున్న ఘటన ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఇక్కడ ఓ ప్రైవేటు సంస్థ ఇప్పటికే చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా, కేవలం మూడు రోజుల వ్యవధిలోనే జీవీఎంసీ అధికారులు తమ సొంత చలివేంద్రాన్ని దాని పక్కనే ఏర్పాటు చేశారు. దీంతో ఒకే చోట రెండు చలివేంద్రాలు ఉండటంతో ప్రజాధనం వృథా అవుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది జీవీఎంసీ నగర వ్యాప్తంగా విస్తృతంగా చలివేంద్రాలు ఏర్పాటు చేసిందని, ఈసారి మాత్రం మొక్కుబడిగా కొద్ది సంఖ్యలో మాత్రమే ఏర్పాటు చేశారని ప్రజలు అంటున్నారు. అలా ఏర్పాటు చేసినా, ఎక్కడ ఏర్పాటు చేయాలో కనీస ప్రణాళిక లేకుండా వ్యవహరించడం విడ్డూరంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కొమ్మాది త్రిశక్తి ఆలయం వద్ద ఒకే దగ్గర ఉన్న రెండు చలివేంద్రాలు

ఘనంగా అనంతుని ఆలయ శిఖర ప్రతిష్ట ఉత్సవాలు

పద్మనాభం: పద్మనాభంలోని కొండపై ఐదు రోజుల పాటు జరగనున్న అనంత పద్మనాభ స్వామి ఆలయ శిఖర ప్రతిష్ట ఉత్సవాలు సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభా నికి ముందు కుంతీ మాధవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఊరేగించారు. అనంతరం ఈ విగ్రహాలను రోడ్డు మార్గం ద్వారా కొండపైకి తీసుకెళ్లి ప్రధాన ఆలయంలో ప్రతిష్ఠించారు. ఉత్సవాలలో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కొండపైనున్న అనంత పద్మనాభ స్వామి ఆలయం విద్యుద్దీపాలతో వెలిగిపోతోంది. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఈవో నానాజీ బాబు, సర్పంచ్ తాలాడ పాప, ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి, ఉత్సవ కమిటీ సభ్యులు తాలాడ పద్మనాభం, కాళ్ల నగేష్ కుమార్, రూపాకుల రవి కుమార్, కంటుబోతు ఎర్నాయుడు, రామసింగు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.


అనంత పద్మనాభ స్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

బీసీ మహిళల కుట్టు శిక్షణ పేరుతో రూ. 167 కోట్ల కుంభకోణం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాగవంశం విభాగం అధ్యక్షుడు బొడ్డు అప్పలనాయుడు



తగరపువలస: బీసీ మహిళలకు కుట్టు శిక్షణ పేరుతో కూటమి ప్రభుత్వం రూ. 167 కోట్ల కుంభకోణానికి పాల్పడిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాగవంశం విభాగం అధ్యక్షుడు బొడ్డు అప్పలనాయుడు ఆరోపించారు. సోమవారం ఆయన నాగవంశ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్‌పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మతో కలిసి చిట్టివలసలో విలేకరులతో మాట్లాడారు. మహిళలకు అండగా ఉంటామని, ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తామని చెప్పి ప్రభుత్వం భారీ అవినీతికి పాల్పడిందని ఆయన విమర్శించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున కుట్టు శిక్షణ ప్రారంభిస్తామని చెప్పిన ప్రభుత్వం, శిక్షణ ప్రారంభించకుండానే దోపిడీకి సిద్ధమైందని ఆరోపించారు. ఒక్కో లబ్ధిదారుని పేరుతో రూ. 16,700 కొట్టేయడానికి పథకం రూపొందించారని ఆయన ఆరోపించారు. ఈ టెండర్ల ప్రక్రియలో 67 కంపెనీలు పాల్గొనగా, 56 కంపెనీలను తిరస్కరించారని, ఫైనాన్స్ బిడ్ తెరవకముందే అనర్హత సాకుతో మరో 9 కంపెనీలను తొలగించారని అప్పలనాయుడు తెలిపారు. అన్ని అడ్డంకులు దాటుకుని శ్రీ టెక్నాలజీ ఎల్1గా నిలవగా, కుంభకోణం సూత్రధారులు ఆ సంస్థ యాజమాన్యాన్ని బెదిరించారని ఆరోపించారు. వారికి 5 శాతం పని మాత్రమే అప్పగించి, 95 శాతం ఒకే యజమాని అయిన ఎల్2, ఎల్3 కంపెనీలకు అప్పగించారని ఆయన ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బీసీలను వెన్నెముకగా అభివర్ణిస్తే, కూటమి ప్రభుత్వం వారిని అడ్డం పెట్టుకుని కోట్లాది రూపాయలు కొల్లగొడుతోందని అప్పలనాయుడు విమర్శించారు. ఈ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

అనంత పద్మనాభ స్వామి ఆలయ ఉత్సవానికి విరాళం

పద్మనాభం: పద్మనాభంలో జరగనున్న అనంత పద్మనాభ స్వామి ఆలయ శిఖర ప్రతిష్ట ఉత్సవాల నిర్వహణ కోసం రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రూపాకుల రవి కుమార్ రూ.25 వేల విరాళం అందించారు. సోమవారం కుంతీ మాధవ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆయన ఈవో నానాజీ బాబుకు చెక్కు రూపంలో విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్. శ్రీనివాసరావు, కె. నగేష్ కుమార్ పాల్గొన్నారు. ఆరు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి.

మధురవాడ సమస్యలపై ఫిర్యాదులు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మానం ఆంజనేయులు కాలనీలో రోడ్లు, కాల్వలను బ్లాక్ చేసిన ఓ వ్యక్తి అక్రమంగా గోడలు కట్టడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం విశాఖలోని పీజీఆర్ఎస్‌లో ఆయన ఆధ్వర్యంలో మానం ఆంజనేయులు నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్ తదితరులు వీఎంఆర్‌డీఏ కమిషనర్, జిల్లా కలెక్టర్‌లకు వేర్వేరుగా ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 125/2, 126/2లో ఈడబ్ల్యూఎస్ వుడా ఎల్‌పీ నంబర్ 87/97 లేఅవుట్ ప్లాన్ ప్రకారం సర్వే నంబర్ 126/4లో ఉన్న వుడా భూమిని ఆనుకుని రోడ్లు, కాల్వలు చూపించి 325 మందికి ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందన్నారు. అయితే ఓ వ్యక్తి సర్వే నంబర్ 126/4లోని భూమి తనదని చెబుతూ, కాలనీలోని ఐదు చోట్ల కాల్వలను అక్రమంగా మూసివేశారని ఆరోపించారు. గతంలో కూడా ఈ సమస్యపై ఫిర్యాదు చేసినా, అధికారులు పట్టించుకోలేదని వారు వాపోయారు. తక్షణమే స్పందించి, అక్రమ నిర్మాణాలను తొలగించి, రోడ్లు, కాల్వలను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఫిర్యాదు కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ప్రతాపరాజు, పాండ్రంకి అప్పారావు, జేడీ నాయుడు, సీహెచ్‌వై నాయుడు తదితరులు పాల్గొన్నారు.


మానం ఆంజనేయకాలనీలో కాలువ మూసివేతపై వీఎంఆర్‌డీ కమిషనర్ ఫిర్యాదు చేస్తున్న పైడిరాజు

స్వతంత్రనగర్‌లో పార్కు ఆక్రమణ: వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

అదేవిధంగా జీవీఎంసీ 7వ వార్డు స్వతంత్రనగర్‌లో ప్రభుత్వ పార్కుకు చెందిన సుమారు 150 గజాల స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆలయం పేరుతో ఆక్రమిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఆరోపించింది. ఈ మేరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు చేకూరి రజని, నాయకులు జ్యోతిష్ ఫిర్యాదు చేశారు. ఈ అక్రమ నిర్మాణానికి జీవీఎంసీ జోన్–2 కమిషనరే శంకుస్థాపన చేయడం మరింత ఆశ్చర్యానికి గురిచేసిందని వారు విమర్శించారు. ప్రభుత్వ భూమిని పరిరక్షించడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.


స్వతంత్రనగర్‌లో పార్కు ఆక్రమణపై జీవీఎంసీలో ఫిర్యాదు చేస్తున్న రజని

పీజీఆర్ఎస్‌లో ఆరు ఫిర్యాదులు


మంచినీటి సమస్య పరిష్కరించాలని జెడ్సీకి వినతి పత్రాన్ని అందిస్తున్న సీసీఎం కార్యదర్శి మూర్తి

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయంలో సోమవారం జెడ్సీ ఒమ్మి అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కు ఆరు వినతులు వచ్చాయి. వీటిలో మూడు ఇంజనీరింగ్, రెండు రెవెన్యూ, ఒకటి యూసీడీ విభాగానికి సంబంధించినవి. నాలుగో వార్డు నేరెళ్లవలస సమీపంలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఎం జోన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి వినతిపత్రం అందజేశారు. కాలనీలో తీవ్రమైన తాగునీటి కొరత ఉందని, చుట్టుపక్కల తుప్పలు, కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నర్సింగరావు, బాలాజీ, సురేష్ పాల్గొన్నారు.

15 అర్జీల స్వీకరణ

జీవీఎంసీ మధురవాడ జోన్–2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయి. జోనల్ కమిషనర్ కె. కనకమహాలక్ష్మి స్వయంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జోన్‌లోని 5 నుంచి 13 వరకు గల 9 వార్డుల పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 15 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని కనకమహాలక్ష్మి తెలిపారు.


జెడ్సీ కనకమహాలక్ష్మి సమస్యలు వివరిస్తున్న ఫిర్యాదుదారులు

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న కిషోర్ బాబు

పీఎం పాలెం: మారుతున్న విద్యా, ఉద్యోగ అవసరాలకు అనుగుణంగా ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై మెరుగైన అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కిషోర్ బాబు అన్నారు. సోమవారం బాబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన టెక్నో అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు అర్థం కాని అంశాలపై శ్రద్ధ వహించి, అధ్యాపకులను అడిగి సందేహాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా సానుకూల దృక్పథం కలిగి ఉండాలన్నారు. కళాశాల కార్యదర్శి కె. శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచుతాయని తెలిపారు. ప్రిన్సిపల్ బి. పూర్ణ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ అనిల్ కుమార్, బేసిక్ సైన్సెస్ హెడ్ డాక్టర్ జయరంగారావు పాల్గొన్నారు.

పాఠశాలలు తెరిచేలోగా పుస్తకాలు పంపిణీ చేయాలి

తగరపువలస: పాఠశాలలు తెరచేలోగా పుస్తకాలు పంపిణీ పూర్తి చేయాలని రాష్ట్ర పరిశీలకురాలు పి.వి జయలక్ష్మి సూచించారు. సోమవారం సాయంత్రం ఆమె బ్యాంకు కాలనీలోని సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. రిజిస్టర్ ఆధారంగా స్టాక్‌ను పరిశీలించి సూచనలు చేశారు. ఆమె వెంట పీఎంవో దేవుడుబాబు, ఎంఈవోలు, సీర్పీలు ఉన్నారు.


పుస్తకాల స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకురాలు విజయలక్ష్మి

అడిషనల్ పోలీస్ కమాండెంట్‌కు సత్కారం

పీఎంపాలెం: జీవీఎంసీ ఆరో వార్డు పరిధిలోని ఏపీఎస్‌పీ 16వ బెటాలియన్‌లో అడిషనల్ కమాండెంట్‌గా పనిచేస్తున్న సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు పదోన్నతిపై శ్రీకాకుళంలోని 1వ ఐఆర్ పోలీస్ బెటాలియన్‌కు కమాండెంట్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం 16వ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో వీడ్కోలు సత్కార కార్యక్రమం ఏర్పాటు చేశారు. కమాండెంట్ మురళీకృష్ణ మాట్లాడుతూ, అడిషనల్ కమాండెంట్‌గా పద్మనాభరాజు బెటాలియన్ అభివృద్ధికి అందించిన సేవలను కొనియాడారు. అనంతరం అధికారులు ఆయనను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు పీ. సత్యం, జీ. ఇలయసాగర్, వీ. నారాయణ రావు, ఎస్. మురళీధర్, బీ. రామకృష్ణ, యూనిట్ మెడికల్ ఆఫీసర్లు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


పద్మనాభరాజును సత్కరిస్తున్న 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

తగరపువలస: కృష్ణంరాజుపేట యూపీ పాఠశాల ఉపాధ్యాయుడు గొట్టిపల్లి సత్యనారాయణ ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా సోమవారం కొత్త మూలకుద్దు యూపీ పాఠశాలలో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆయనను ఘనంగా సత్కరించింది. ప్రధానోపాధ్యాయుడు డి.దాలయ్య బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గంటాన మోహన రావు, ప్రధాన కార్యదర్శి రేక అప్పారావు, వీఎస్ కృష్ణా కళాశాల సూపరింటెండెంట్ జీవీ అప్పారావు, వెంకటరమణ, రమణ పాల్గొన్నారు.